
‘కొలువు’దీరిన చదువు
కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్‌లో ‘ఉద్యోగ విజయోత్సవం’ పేరిట ఉద్యోగం పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సత్కరించారు. 8లో


రూ.2.50 లక్షల విరాళం
ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ స్లాబ్ పునర్నిర్మాణానికి సీహెచ్ రమేష్‌దత్, తిరుమలదేవి దంపతులు (ఏలూరు), వారి కుమారుడు శ్రీనివాసరావు మంగళవారం రూ.2.50 లక్షల విరాళం సమర్పించారు.

రావణ వాహనంపై సత్యదేవుడు

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం రాత్రి సత్యదేవుడు, అమ్మవారు రావణ బ్రహ్మ వాహనంపై దర్శనమిచ్చారు. 8లో

న్యూస్‌రీల్

గంజాయి రవాణాపై ఉక్కుపాదం


పెద్దాపురం పీఎస్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెద్దాపురం: గంజాయి అక్రమ రవాణా విషయంలో గట్టిగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. స్మగ్లింగ్, గ్యాంబ్లింగ్ వంటి వాటిపై ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టాక ఆయన మంగళవారం పెద్దాపురం పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తాను అల్లూరి జిల్లాలో పని చేసిన సందర్భంలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. ఒరిస్సా సరిహద్దులోని మల్కాజ్‌గిరి, కోరాపుట్ ప్రాంతాల నుంచి ఆంధ్రా మీదుగా గంజాయి అక్రమ రవాణాకు మార్గాలున్నాయన్నారు. ఆ ప్రాంతాల్లో గంజాయి కార్యకలాపాలను చాలామటుకు కట్టడి చేయగలిగామన్నారు. జిల్లా నుంచి గంజాయి రవాణా సమాచారం అందిస్తే సత్వరమే చర్యలు చేపడతామన్నారు. 9440796500 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఆయన వెంట సీఐ అబ్దుల్ నబీ ఉన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లాకు రెండో స్థానం


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

పిఠాపురం: కర్నూల్‌లో గత నెల 30 నుంచి ఈ నెల 1వ తేదీ వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర రగ్బీ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచారని జిల్లా రగ్బీ కోచ్ లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, ఉపాధ్యక్షుడు కేతవరపు కృష్ణ , సీఈఓ కె.నాగలింగేశ్వరరావు, తూర్పు గోదావరి జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.పద్మనాభం క్రీడాకారులు, జిల్లా టీం కోచ్ మేనేజర్‌లుగా వ్యవహరించిన సాయి, వంశీలను అభినందించారు.

తాళ్లరేవు మండలంలో కుండపోత

కాకినాడ సిటీ: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కూడా వర్షం పడింది. మంగళవారం ఉదయం 8గంటలకు సగటున 33 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. తాళ్లరేవు మండలంలో అత్యధికంగా 91 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెదపూడి మండలంలో 12 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. వివిధ మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో ఇలా.. కాకినాడ అర్బన్ 47.4, కరప 41.4, కాకినాడ రూరల్ 40.4, పెద్దాపురం 36.4, జగ్గంపేట 35.2, సామర్లకోట 33.2, పిఠాపురం 30.6, యు కొత్తపల్లి 30.2, కిర్లంపూడి 27.8, శంఖవరం 26, ఏలేశ్వరం 24.2, తుని 23.8, తొండంగి 21.6, ప్రత్తిపాడు 21.4, రౌతులపూడి 19, గండేపల్లి 18.4, కోటనందూరు 14,మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

ఉపాధి పనుల్లో బయటపడిన శివలింగం

గోకవరం: పెంటపల్లి గ్రామంలోని ఓ చెరువులో ఉపాధి పనులు చేస్తుండగా శివలింగం బయటపడింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెంటపల్లి గ్రామ శివారున ఉన్న మర్రివాని చెరువులో మంగళవారం ఉదయం పలువురు ఉపాధి కూలీలు మట్టి పనులు నిర్వహిస్తుండగా గునపానికి కంగుమన్న శబ్దంతో రాయి తగిలింది. సాధారణంగా కనిపించే రాయి అయ్యి ఉంటుందని భావించిన కూలీలు చుట్టూ మట్టి తవ్వి రాయిని వెలికి తీయగా శివలింగం బయటపడింది. వెంటనే కూలీలు శివలింగాన్ని చెరువులో నీటితో శుభ్రం చేశారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో తండోపతండాలుగా చెరువు వద్దకు వచ్చి శివలింగానికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగంపై పాదముద్రలు గుర్తించిన గ్రామస్తులు రెడ్డి రాజుల కాలం నాటిదని భావిస్తున్నారు. తమ గ్రామంలో శివాలయం నిర్మించాలనే ఆలోచనలో ఉన్నామని ఇప్పుడు శివలింగం బయటపడటం తమ అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆలయ నిర్మాణం చేసి ఈ శివలింగాన్ని ప్రతిష్ఠిస్తామని చెప్పారు.

ఆర్బీకేరాఫ్ నిరంతర సేవ

- వలంటీర్ నియామకంతో బలోపేతమైన రైతు భరోసా కేంద్రాలు
- జిల్లాలో అందుబాటులో 215 ఆర్బీకేలు
- వ్యవసాయంలో కొత్త విప్లవానికి నాంది
- అన్నదాతకు అండగా అన్ని రకాల సేవలు

కాకినాడ సిటీ: విత్తనం నుంచి విక్రయం వరకు వ్యవసాయానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) అన్ని రకాల సేవలను అందిస్తూ ఔరా అనిపించుకుంటున్నాయి. అన్నదాతకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి. ఆర్బీకేల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రైతుకు ఏ కష్టం వచ్చినా ఈ కేంద్రాలు భరోసా ఇవ్వగలగాలనే సంకల్పాన్ని ఆచరణ సాధ్యం చేస్తోంది. ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను నియమించింది. రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం వీటిలో గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ), గ్రామ ఉద్యాన సహాయకులు (వీహెచ్ఏ), గ్రామ సెరికల్చర్ సహాయకులు (వీఎస్ఏ) పని చేస్తున్నారు. వీరినే ఆర్బీకే ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్నారు. వీరు ఎక్కువ సమయం క్షేత్రస్థాయిలో ఉండాల్సి వస్తోంది.


ఆర్బీకే కార్యాలయం


రైతులకు యంత్రపరికరాలను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జేసీ ఎస్ ఇలక్కియ(ఫైల్)

మరింత చేరువగా ..

జిల్లాలో 215 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ప్రతి ఆర్బీకేకు ఇంటర్ చదివిన వలంటీర్ నియమితులయ్యారు. ఇది వరకే ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. వీరి ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వీరిలోనే ఇంటర్ (బయాలజీ) చదివిన వారిని గత ఖరీఫ్ సమయంలో ఆర్బీకే వలంటీర్లుగా నియమించారు. వలంటీర్లకు ఆర్బీకేల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. విత్తనాల పంపిణీ, డిజిటల్ కియోస్క్ ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు ఆర్డర్ పెట్టడం, పంపిణీ చేయడం వంటి అన్ని కార్యక్రమాలు ఆర్బీకే ఇన్‌ఛార్జీల పర్యవేక్షణలో వీరు చేపడుతున్నారు. వలంటీర్లను నియామకంతో రైతులకు ఆర్బీకేల సేవలు బాగా చేరువయ్యాయి.

వలంటీర్లు ఎందుకంటే..

ఆర్బీకేలలో ముఖ్య భూమిక పోషిస్తున్న ముగ్గురు ఉద్యోగులూ ప్రధానంగా ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ కోసం ఎక్కువ సమయాన్ని పొలాల్లో వెచ్చించాల్సి వస్తోంది. వారంలో ఒక రోజు పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండల సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించే సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు హాజరు కావాలి. ఇటువంటి సమయాల్లో ఇన్‌ఛార్జిలు బయటకు వెళ్లితే ఆర్బీకేలల్లో ఇబ్బందులు తలెత్తుతాయి. అత్యవసర సమయాల్లో కొందరు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వెళ్లింది. వెంటనే ఆయన స్పందించారు. సమస్య పరిష్కారంగా వలంటీర్ల నియామకానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిరంతరం సేవలు అందే అవకాశం ఏర్పడింది. దీనిపై రైతుల నుంచి హర్షేతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

దేశానికి రోల్ మోడల్‌గా ఆర్బీకేలు

గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు కావడంతో రైతులు ఎదుర్కొనే అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. విత్తన ఎంపిక నుంచి పంట విక్రయం వరకు అన్ని రకాల సేవలు ఆర్బీకేల్లో లభ్యమవుతున్నాయి. దీంతో ఇవి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచాయి. వలంటీర్లు ఆర్బీకేల్లో రైతులకు సేవలు అందించడంతో మరో విప్లవాత్మక మార్పుకు అవకాశం ఏర్పడింది. గతంలో ప్రైవేటు డీలర్లు రసాయ ఎరువులను అడ్డుగోలుగా అధిక ధరలకు విక్రయించేవారు. ఎమ్మార్పీపై రూ. 50 నుంచి రూ. 100 వరకు ఎక్కువ వసూలు చేసేవారు. ఆర్బీకేల ఏర్పాటుతో ప్రయివేటు డీలర్ల అక్రమాలు చాలా వరకు అదుపులోకి వచ్చాయి. రబీ సీజన్‌కు సంబంధించి అవసరమైనన్ని ఎరువులు సిద్ధం చేశారు. ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. అన్ని రకాల పురుగు మందులను కూడా నిర్దిష్టమైన ధరలకు విక్రయిస్తున్నారు.

శుభపరిణామం


ప్రతి ఆర్బీకేకు వలంటీర్‌ను నియమించి సేవలు అందించడం అభినందనీయం. దీంతో సేవలు మరింత చేరువ అయ్యాయి. ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పొందుతున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి. వ్యవసాయ అధికారులు మా పొలంలో వేసిన పంటను పరిశీలించి ఈ-క్రాప్‌లో నమోదు చేయడం సంతోషం కలిగించింది.

తోటకూర శ్రీను, కరకుదురు, పెదపూడి మండలం

ఆర్‌బీకే సేవలు అద్భుతం


రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సేవలు అద్భుతం. రైతుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సేవలు అందుతున్నాయి. వీఏఏలు క్షేత్రస్థాయిలో ఉన్నప్పుడు కొంతమేర ఇబ్బందులు పడేవాళ్లం.ప్రభుత్వం వలంటీర్లను నియమించి మా సమస్యను పరిష్కరించింది. ఈ విధానం దేశంలో ఎక్కడా లేదు. ఆర్బీకేలు ఏర్పాటు, సిబ్బంది నియామకం, వీటి ద్వారా రైతులకు సేవలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి రైతు కుటుంబం రుణపడి ఉంటుంది.

కాళ్ల శ్రీనివాస్, తణుకువాడ, కాజులూరు మండలం.

ఆందోళన వద్దు.. ప్రతి గింజా కొంటాం

రైతులకు ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇలక్కియా భరోసా

కరప: అడపాదడపా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందవద్దని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా రైతులకు భరోసా ఇచ్చారు. , రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రతీ ధాన్యం గింజనూ కొంటామన్నారు. మంగళవారం ఆమె కరపమండలంలో పర్యటించారు. పెనుగుదురులో తడిసిన వరిచేలను, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ కష్టాలను ఆమెకు వివరించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ స్పందించి రైతులకు ధైర్యాన్నిచ్చారు. ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేస్తామన్నారు. వర్షప్రభావం వల్ల తేమతగ్గినా, రంగుమారినా ఆర్‌బీకేల ద్వారా మద్దతుధరకు కొనుగోలు చేస్తామన్నారు. ఆందోళన వద్దని ఆమె రైతులకు స్పష్టంచేశారు. రబీలో ఇంతవరకూ 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. బొండాలు రకం ధాన్యం కొనుగోలుకు సంబంధించి వదంతులను నమ్మవద్దన్నారు. ఈ రకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామన్నారు. అనంతరం ఆమె పెనుగుదురులో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన స్టోన్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కర్రె స్వప్న, ఎంఏఓ ఏవీ రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, రెడ్డిపల్లి రమేష్, వీఆర్వో పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


పెనుగుదురులో నీటమునిగిన వరిదుబ్బులను ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇలక్కియాకు చూపిస్తున్న దృశ్యం

యాప్‌రే.. ఇంత మోసమా..

- యూ ట్యూబ్ లింక్ క్లిక్‌తో ఖాతాలో సొమ్ము హుష్‌కాకి
- వెలుగు చూసిన కొత్త సైబర్ నేరం
- మోసపోవద్దని పోలీసుల హెచ్చరిక



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): లింక్ క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయం అవ్వడం ఇప్పటివరకు చూస్తున్నాం..సైబర్ నేరగాళ్లు మరో అడుగు ముందుకేసి మోసానికి తెగబడుతూ విస్మయానికి గురి చేస్తున్నారు. తాజాగా యూట్యూబ్ లింక్ క్లిక్ చేసి లైక్ కొడితే డబ్బులు పోయిన వెలుగు చూసింది. ఇలాంటి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ముందస్తుగా జాగ్రత్త పడాలని జిల్లా పోలీసులు హెచ్చరిస్తున్నారు. దీనికి సంబంధించి వెల్లడించిన వివరాలివి..

అయ్యో శ్రీహరీ...

తక్కువ కష్టంతో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో శ్రీహరి అనే యువకుడు రూ.10 లక్షల డబ్బులు పోగొట్టుకున్నాడు. యూట్యూబ్ లింక్‌లకు లైక్‌లు కొట్టి ఈ విధంగా మోసపోయాడు. శ్రీహరి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. నెలకు సరిపడా జీతంతో ఉద్యోగం ఉంది. అనుకోకుండా ఒక రోజు వాట్సప్ నుంచి ఒక యూట్యూబ్ వీడియో లింక్ వచ్చింది. ఆ లింక్‌ని చూసి లైక్ కొడితే రూ.50 వస్తుందని కింద సమాచారం ఉంది. వెంటనే అతను ముందూ వెనకా ఆలోచించకుండా ఆ లింక్ ఓపెన్ చేశాడు. ఆ వీడియోకి లైక్ కొట్టి కామెంట్ చేశాడు. అతనికి రూ.50 ఖాతాకు జమ అయ్యింది.


ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి

దీంతో రెట్టించిన ఉత్సాహంతో శ్రీహరి వారు పంపిన మరిన్ని వీడియోలకు లైకులు కొట్టి కామెంట్ చేయడం మొదలెట్టాడు. ఆరోజు రూ.300 సంపాదించాడు. రెండో రోజు క్రిప్టో బెట్టింగ్ యాప్ వచ్చింది. దాంతో పాటు టెలిగ్రామ్ యూజర్ ఐడీ కూడా వచ్చింది. దీంతో శ్రీహరి టెలిగ్రామ్ యాప్ లోకి వెళ్లి వారు చెప్పిన విధంగా యాప్‌ను ఓపెన్ చేశాడు. అందులో రూ.3 వేలు జమ చేస్తే రూ.3,900 వస్తాయి అని ఉంది. శ్రీహరి వెంటనే ఆ మొత్తాన్ని జమ చేశాడు. రూ.3,900 రూపాయలు వచ్చినట్లు యాప్‌లో చూపించింది.

మోసపోయాడిలా.. : దఫదఫాలుగా శ్రీహరి అధిక సొమ్ము యాప్‌నకు చెల్లించాడు. తర్వాత శ్రీహరి తనకు వచ్చిన డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నించాడు. రూ.20 వేలు పూర్తయితేనే ముందు కట్టిన మొత్తం వస్తుందని యాప్ నిర్వాహకులు తెలిపారు. అతడు రూ.20 వేలు ఒకసారి, వారి డిమాండ్ మేరకు మరోమారు రూ.50 వేలు చెల్లించాడు. అతనికి టెలిగ్రామ్ నుంచి మెసేజ్ వచ్చింది. రూ.లక్ష కడితేనే మొత్తం సొమ్ము రూ.లక్షా 60 వేలు వెనక్కివస్తుందనేది అందులో సారాంశం. అతని వద్ద డబ్బులు లేకపోవడంతో స్నేహితుల నుంచి అప్పు తీసుకుని యాప్‌లో రూ.లక్ష చెల్లించాడు. వెంటనే అతనికి రూ.2.60 లక్షలు డిపాజిట్ అయినట్లు యాప్ లో చూపించింది. శ్రీహరి డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నించాడు. టెలిగ్రామ్ యాప్ 70శాతం మాత్రమే పూర్తి చేశారని.. మిగిలిన 30 శాతం పూర్తి చేస్తే రెట్టింపు సొమ్ము వస్తుందని నిర్వాహకుల నుంచి సమాచారం వచ్చింది. డబ్బులు లేకపోవడంతో క్రెడిట్‌కార్డు నుంచి విత్ డ్రా చేసి పూర్తిగా రూ.10 లక్షలు కట్టడంతో యాప్ లో అతనికి రూ.16 లక్షలు చూపించింది. ఆ సొమ్ము తీసుకునేందుకు ప్రయత్నించగా రాలేదని తెలుసుకున్నాడు. తర్వాత అతను ఫోన్ చేసినా యాప్ నిర్వాహకులు ఎత్తలేదు. తాను మోసపోయానని శ్రీహరి గ్రహించాడు.తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసి లబోదిబోమన్నాడు. ఇలాంటి సైబర్ నేరాలు అందరికీ తెలియాలనే ఉద్దేశంతో మోసం జరిగే తీరును జిల్లా ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి మంగళవారం మీడియాకు వివరించారు. అధిక లాభాలు వస్తాయని ఆన్‌లైన్‌లో తెలియని లింకులు క్లిక్ చేయవద్దని ఆయన సూచించారు. కొత్త వ్యక్తులు (సైబర్ నేరస్తులు) చేసే మేసేజ్‌లు, యూట్యూబ్ వీడియో లింక్స్, యాప్స్ వంటివి వెంటనే తిరస్కరించాలన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలన్నారు. సైబర్‌క్రైమ్.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

కల్యాణ వేదికపైనే సత్యదేవుని శ్రీపుష్పయాగం...

రూ.20 లక్షలు వ్యయంతో ఏర్పాట్లు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించిన దేవస్థానం అధికారులు ఉత్సవాల్లో చివరిరోజు ఈ నెల 6న సత్యదేవుని శ్రీపుష్పయాగాన్ని (విరుల పండుగ) అదే స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈసారి శ్రీపుష్పయాగాన్ని స్వామివారి కల్యాణం నిర్వహించిన వార్షిక కల్యాణ మండపం మీదనే నిర్వహించాలని నిర్ణయించినట్లు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ మంగళవారం తెలిపారు. ఏటా శ్రీపుష్పయాగాన్ని స్వామివారి నిత్య కల్యాణ మండపంలో నిర్వహిస్తుండగా వేల సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. కాగా స్వామివారి నిత్యకల్యాణ మండపంలో వేయి మందికి మించి భక్తులు పాల్గొనే అవకాశం లేదు. స్వామివారి వార్షిక కల్యాణ మండపంలో అయితే సుమారు మూడు వేల మంది భక్తులు శ్రీపుష్పయాగాన్ని తిలకించవచ్చు. మండపం వెలుపల స్క్రీన్లు ఏర్పాటు చేస్తే మరో మూడు వేల మంది తిలకించే అవకాశం ఉంటుంది. శ్రీపుష్పయాగానికి హాజరైన మహిళలందరికీ స్వామివారి ప్రసాదం, పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.



గతేడాది నిత్యకల్యాణ మండపంలో నిర్వహించిన సత్యదేవుని శ్రీపుష్పయాగం (ఫైల్)

భారీగా ఏర్పాట్లు

సత్యదేవుని శ్రీపుష్పయాగాన్ని ఈసారి స్వామివారి వార్షిక కల్యాణ వేదిక మీద నిర్వహించాలని నిర్ణయించాం. పుష్పాలంకరణకు రూ.16 లక్షలు, ఇతర ఏర్పాట్లుకు మరో రూ.నాలుగు లక్షలు వరకు వ్యయం అవుతుందని అంచనా. కల్యాణ వేదిక, దాని ముందు గల విశ్రాంతి మండపాన్ని సుమారు టన్ను పూలతో అలంకరించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. కల్యాణ మహోత్సవాలు పూర్తయ్యాక నిత్య కల్యాణ మండపం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

చంద్రశేఖర్ అజాద్, ఈఓ, రత్నగిరి దేవస్థానం

వసూళ్ల వర్షం



- మున్సిపాలిటీల్లో 5 శాతం పన్ను రాయితీకి ముగిసిన గడువు
- ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్ పన్ను వసూళ్లు రూ.51.74 కోట్లు
- చివరి ఐదు రోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.23.11 కోట్ల రాబడి
- గత ఏడాది ఏప్రిల్ కంటే ఈసారి రూ.5.23 కోట్ల అదనపు ఆదాయం

కొవ్వూరు: ఐదు శాతం పన్ను రాయితీని వినియోగించుకునేందుకు మున్సిపల్ వాసులు క్యూ కట్టారు. చివరి ఐదు రోజులూ రికార్డు స్థాయిలో పన్నులు వసూలు కావడమే ఇందుకు నిదర్శనం. గడచిన ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెలాఖరు లోపు మొత్తం ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి గడువు గత నెల 30తో ముగిసింది.

ఈ ఆఫర్‌కు కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ మూడు జిల్లాల్లో గత నెల 1 నుంచి 24వ తేదీ వరకూ రూ.28.63 కోట్ల పన్నులు వసూలవగా.. ఆ తరువాత చివరి ఐదు రోజుల్లో రికార్డు స్థాయిలో రూ.23.11 కోట్ల మేర వసూలు కావడం గమనార్హం . 2021–22 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో 5 శాతం రాయితీతో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని మున్సిపల్ పట్టణ ప్రజలు రూ.46.51 కోట్ల మేర పన్నులు చెల్లించారు. ఈ ఏడాది రూ.5.23 కోట్లు అదనంగా వసూలై, రూ.51.74 కోట్లకు చేరింది. ఈ మూడు జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.283.58 కోట్ల మేర పన్నులు వసూలు కావాల్సి ఉంది. ఇందులో 18.24 శాతం ఐదు శాతం రాయితీ కారణంగా కేవలం నెల రోజుల వ్యవధిలోనే వసూలైంది. తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా 19.91 శాతం, కాకినాడ జిల్లాలో 19.02 శాతం మేర పన్నులు వసూలు కాగా, కోనసీమ జిల్లాలో మాత్రం అత్యల్పంగా 7.87 శాతం మాత్రమే వసూలు జరిగింది.

ఏప్రిల్‌లో 5 శాతం పన్ను రాయితీతో వసూలైన పన్నులు (రూ.కోట్లలో)

జిల్లా	అసెస్‌మెంట్లు	మొత్తం పన్ను	గత ఏడాది వసూలు	ఈ ఏడాది వసూలు	వ్యత్యాసం
తూర్పు గోదావరి	1,05,503	121.37	20.08	24.17	4.09
కాకినాడ	1,53,403	132.75	21.43	25.25	3.82
కోనసీమ	49,336	29.46	5.00	2.32	– 2.68

రాయితీకి విశేష స్పందన


ఏప్రిల్‌లో ఇచ్చిన 5 శాతం పన్ను రాయితీకి స్పందన బాగుంది. చివరి ఐదు రోజుల్లో రికార్డు స్థాయిలో పన్నులు చెల్లించారు. గత ఏడాది కంటే పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయి. పన్ను రాయితీపై విస్తృత ప్రచారం నిర్వహించడంతో మంచి ఫలితాలు వచ్చాయి.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

'వందేభారత్'పై రాళ్ల దాడి కేసులో ముగ్గురి అరెస్టు



రాళ్ల దాడికి పాల్పడిన మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించిన ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య తదితరులు

రాజమహేంద్రవరం సిటీ/సామర్లకోట: వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్లతో దాడికి పాల్పడిన వారిలో ముగ్గురిని రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.సైదయ్య కథనం ప్రకారం.. విశాఖపట్నం – సికింద్రాబాద్ వందేభారత్ రైలు(20833)పై గత నెల 28న పిఠాపురం – సామర్లకోట మధ్య రాళ్లతో దాడి జరిగింది. దీనిపై ఆర్‌పీఎఫ్‌తో పాటు ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ), సీఐబీ అధికారులు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన ఆరుగురిని ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. సామర్లకోటకు చెందిన బొడ్డు రాజు, సప్పా దుర్గ, కోట రవి, మరో ముగ్గురు బాలురు రైల్వే ట్రాక్ పక్కనే ఉండి ఈ దాడికి పాల్పడ్డారని నిర్ధారించారు. ప్రయాణికులను భయపెట్టేందుకు వీరు ఈ దాడికి పాల్పడగా జీ–1 బోగీ కిటికీ అద్దాలు పగిలిపోయాయి. నిందితులు తమ నేరాన్ని అంగీకరించారని సైదయ్య తెలిపారు. ఈ దాడిలో మేజర్లు అయిన ముగ్గురినీ అరెస్టు చేసి, విజయవాడ రైల్వే కోర్టులో మంగళవారం హాజరు పరచి, రిమాండుకు తరలించారు. మైనర్లయిన మిగిలిన ముగ్గురినీ స్థానిక జువైనల్ హోమ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో కాకినాడ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ డి.రామారావు, ఎస్సై బి.లోవరాజు, ఏఎస్సై పి.సత్యనారాయణ, సిబ్బంది కీలక పాత్ర పోషించారని సైదయ్య చెప్పారు. రైల్వే ఆస్తులకు ఎవరైనా నష్టం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

'కొలువు' దీరిన చదువు

- 215 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు
- అట్టహాసంగా ఉద్యోగ విజయోత్సవం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చదువు పూర్తయ్యాక ఏ విద్యార్థీ ఉపాధి కోసం ఇబ్బంది పడకూడదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష ఇది. ఇందుకు అనుగుణంగా మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో ఆయన ప్రభుత్వం వివిధ మార్పులు తీసుకు వచ్చింది. ముఖ్యంగా నైపుణ్యంపై బాగా ఫోకస్ పెట్టింది. దీంతో విద్యార్థులను వెతుక్కుంటూ కంపెనీలే రావడం మొదలైంది. పాలిటెక్నిక్ కళాశాలకూ ఇది విస్తరించింది. పదో తరగతి పూర్తయిన తరువాత పాలిటెక్నిక్ మూడేళ్లు చదవగానే సామర్థ్యాన్ని బట్టి ఉద్యోగం లభించేలా ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ ఇందుకు దోహదపడింది. 'ఉద్యోగ విజయోత్సవం' పేరిట మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికగా నిలిచింది. ఉద్యోగం పొందిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సత్కరించే కొత్త సంప్రదాయానికి నాంది పలికింది. కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ బ్రాంచిలకు చెందిన 215 మంది తృతీయ సంవత్సర విద్యార్థులు ఈ విజయోత్సవంలో పాల్గొన్నారు. వీరందరూ రూ.1.80 వేల నుంచి రూ.3 లక్షల వరకూ వార్షిక ఆదాయమున్న ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగ విజయోత్సవంలో ఎంపీ వంగా గీత, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ప్రిన్సిపాల్ జనార్దనరావు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు.



ఉద్యోగం పొందిన విద్యార్థిని, తల్లిని సత్కరిస్తున్న ఎంపీ వంగా గీత, విద్యాశాఖ కమిషనర్ నాగరాణి. చిత్రంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి

ఉద్యోగ విజయోత్సవం బాగుంది



కళాశాలలో మొదటిసారిగా ఉద్యోగ విజయోత్సవం పేరుతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా జూనియర్ విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయి. మంచి స్కిల్స్ పెంపొందించుకుని ఉద్యోగాలు సాధించాలనే అభిప్రాయం వారికి ఏర్పడుతుంది. డీవీ టెక్నాలజీలో రూ.2.70 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించాను.

– పూర్ణచంద్ర రెల్లి

ఆనందంగా ఉంది



సివిల్ విభాగంలో పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. తొలి ప్రయత్నంలోనే ఎస్‌డీవీఎల్ సంస్థలో రూ.1.50 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. జగనన్న విద్యాదీవెన వంటి పథకలతో పాటు ఉద్యోగాలు సాధించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఆనందంగా ఉంది.

– ఎ.యార్ణమ్మ

రూ.3 లక్షల ప్యాకేజీతో..



మేధా సర్వో డ్రైవ్ రూ.3 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం ఆఫర్ చేసింది. ప్రభుత్వ కళాశాలకు ప్రైవేటు సంస్థలు వచ్చి ఉద్యోగాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. పాలిటెక్నిక్‌లో ఈసీఈ బ్రాంచి ఆఖరి సంవత్సరం చదువుతున్నాను.

– కె.నిషిత

సీఎం పర్యటన 24కు వాయిదా

- భారీ వర్షాల నేపథ్యంలో నిర్ణయం
- హోం మంత్రి వనిత వెల్లడి



కొవ్వూరు: భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఈ నెల 24వ తేదీకి వాయిదా పడింది. కొవ్వూరులోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ల సేవలను గుర్తించి, సత్కరించి, నగదు పురస్కారాలు అందించేందుకు 'వలంటీర్లకు వందనం' పేరుతో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని బుధవారం కొవ్వూరులో నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. ఇందులో సీఎం జగన్ పాల్గొని, బహిరంగ సభలో పాలొనాల్సి ఉంది. అయితే, వర్షాల కారణంగా ఏర్పడిన ప్రతికూల వాతావరణంతో సీఎం పర్యటన ఏర్పాట్లకు ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడిందని మంత్రి తెలిపారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం ఈ నెల 24న కొవ్వూరులోనే జరుగుతుందని చెప్పారు.

రావణ వాహనంపై సత్యదేవుడు

- అన్నవరంలో ఘనంగా ఊరేగింపు
- తరలివచ్చిన భక్తులు, గ్రామస్తులు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్లు రావణబ్రహ్మ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రాత్రి 9 గంటలకు ఊరేగింపుగా కొండ దిగువన తొలి పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సర్వాంగసుందరంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై స్వామి, అమ్మవార్లను పండితులు వేంచేయించి పూజలు చేశారు. అనంతరం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. తొలి పావంచా నుంచి ఆంధ్రా బ్యాంక్ సెంటర్ వరకూ, అక్కడి నుంచి మళ్లీ తొలి పావంచా వరకూ ఊరేగింపు సాగింది. సత్యదేవుని వాహన సేవల్లో అతి పెద్దది రావణబ్రహ్మ వాహనం. దీంతో ఈ ఊరేగింపును చూసేందుకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు తరలివచ్చారు. ఊరేగింపు సాగినంతసేపూ బాణసంచా కాల్చారు. పలువురు కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శించారు. ఊరేగింపు సందర్భంగా అన్నవరం గ్రామంలోకి భారీ వాహనాలను అనుమతించలేదు. ఎస్సై శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, స్వామివారి కల్యాణోత్సవాలకు వర్షంతో ఆటంకం కలగకుండా ఉండేందుకు దేవస్థానం పండితులు సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. యంత్రాలయంలో సూర్యభగవానుడికి దేవస్థానం ఈఓ అజాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పు రాజగోపురం వద్ద సూర్య భగవానుడికి బూర్లు నివేదించి, ఆకాశంలోకి ఎగురవేశారు. ఈ బూర్లను భక్తులు ప్రసాదంగా స్వీకరించారు. ఏర్పాట్లను ఏఈఓ కృష్ణారావు పర్యవేక్షించారు.



రావణబ్రహ్మ వాహనంపై సాగుతున్న సత్యదేవుడు, అమ్మవార్ల ఊరేగింపు

ఘనంగా స్థాలీపాక హోమాలు

అంతకుముందు నవ దంపతులుగా కొలువుదీరిన స్వామి, అమ్మవార్లకు దర్బారు మండపంలో స్థాలీపాక హోమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను తూర్పు రాజగోపురం వద్దకు వేద పండితులు ఊరేగింపుగా తీసుకువచ్చి, అరుంధతీ నక్షత్ర దర్శనం చేయించి, పూజలు చేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, ఇంద్రగంటి నరసింహమూర్తి, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు అరుంధతీ నక్షత్ర దర్శనం చేయిస్తున్న పండితులు



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



ఊరేగింపులో ఈఓ చంద్రశేఖర్ అజాద్, అర్చకులు, సిబ్బంది

ఆరుగురు దోపిడీ దొంగల అరెస్టు

కాకినాడ క్రైం: రెండు వేర్వేరు చోరీల్లో పట్టుబడిన ఆరుగురు దోపిడీ దొంగల్ని పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఇంద్రపాలెంలోని ఓ ఆయిల్ మిల్లులో పని చేసిన మల్లాది ప్రసాద్ యజమాని ఇంటిపై కన్ను వేశాడు. యజమాని ఇంటి కింది అంతస్తులో మిల్లు ఉండగా పై అంతస్తులో వృద్ధ దంపతులు నివసిస్తున్నారు. వారి నుంచి బంగారం, డబ్బు దోచేయడానికి మరో ఇద్దరితో కలిసి ప్రసాద్ పథకం వేశాడు. ఈ క్రమంలో పాత నేరస్తుడైన జగన్నాథపురం నాగరాజుపేటకు చెందిన డొక్కాడ మహేష్, ఏటిమొగకు చెందిన పెసంగి ప్రసాద్ కలిసి వృద్ధ దంపతుల్ని బెదిరించారు. వారిని తాళ్లతో కట్టేసి 207 గ్రాముల బంగారం, 4.7 కిలోల వెండి, సెల్ ఫోన్ దొంగిలించి పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసిన ఇంద్రపాలెం పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8.9 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

అలాగే, గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ముగ్గురు దోపిడీ దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం కొంతమూరుకు చెందిన మానిపాటి విజయకుమార్, క్వారీ మార్కెట్‌కు చెందిన నదిపూడి మధు, కర్రి మూర్తి కలిసి, కొద్ది రోజుల క్రితం గొల్లప్రోలు వద్ద దారి దోపిడీకి పాల్పడ్డారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పాట్నూరి ధర్మరాజు అనే వ్యక్తిని ఆపారు. అతడిపై దాడి చేసి, కొట్టుకుంటూ సమీపంలోని మామిడి తోటల్లోకి తీసుకువెళ్లారు. అతడి నుంచి రూ.1.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్ దొంగిలించారు. ఈ కేసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన ఇంద్రపాలెం, గొల్లప్రోలు పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆమెది హత్యే

- అదృశ్యమైన వారం తరువాత మహిళ మృతదేహం లభ్యం
- అనుమానాస్పద మృతిగా తొలుత కేసు
- వివాహేతర సంబంధం కలిగిన వ్యక్తే హతమార్చాడని నిర్ధారణ
- నిందితుడి అరెస్టు

కొత్తపేట: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాము లక్ష్మి హత్యకు గురైందని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. డీఎస్పీ కథనం ప్రకారం.. మండలంలోని వానపల్లి శివారు ఇందిరా నగర్‌కు చెందిన లక్ష్మి గతంలో అదృశ్యమైంది. వారం రోజుల తరువాత గత నెల 22న ఆమె ఇంటికి సమీపంలోని ఒక రైతు మోటారు బావిలో శవమై కనిపించింది. దీనిపై ఆమె భర్త కాసు ఫిర్యాదు మేరకు ఎస్సై వి.మణికుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. డీఎస్పీ రమణ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఈ కేసు దర్యాప్తు ప్రారంభించారు. లక్ష్మితో వివాహేతర సంబంధం కలిగిన వ్యక్తే ఆమెను హతమార్చాడని నిర్ధారించారు. లక్ష్మితో వాడపాలేనికి చెందిన మీసాల ఏసు పదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆమెకు ఆర్థికంగా సాయం కూడా చేస్తున్నాడు. ఇటీవల ఆమె ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతూ వేరే వాళ్లతో చనువుగా ఉంటోంది.

తన మాట కూడా వినకపోవడంతో ఏసు ఆమెపై అనుమానం పెంచుకుని, చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు గత నెల 15వ తేదీ రాత్రి తన తోటలోని గేదెలపాక వద్దకు ఆమెను పిలిచాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తనతో తెచ్చుకున్న తాడును లక్ష్మి పీకకు బిగించి హతమార్చాడు. అనంతరం తనపై ఎవ్వరికీ అనుమానం రాకుండా లక్ష్మి శవాన్ని తీసుకువెళ్లి సమీపంలోని బండారు గంగరాజు అనే రైతు పొలంలోని మోటారు బావిలో పడేశాడు. బావిపై సిమెంటు ప్లేటు మూసేశాడు. ఏసుపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. లక్ష్మిని తానే హతమార్చినట్టు అంగీకరించాడు. అతడు హత్యకు ఉపయోగించిన తాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఏసును బుధవారం కోర్టులో హాజరు పరచనున్నామని డీఎస్పీ రమణ తెలిపారు. విలేకర్ల సమావేశంలో సీఐ రజనీకుమార్, ఎస్సై మణికుమార్, ఏఎస్సై కృష్ణారావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ రమణ

పాము కాట్లతో ముగ్గురి మృతి


సామర్లకోట/రాజానగరం/అంబాజీపేట: కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పాము కాట్లకు గురై ముగ్గురు మృతి చెందారు. సామర్లకోట మండలం జి.మేడపాడులోని కొత్తూరు రోడ్డులో ఉన్న సీతారామ చెరువులో ఉపాధి కూలీలు మంగళవారం పని చేస్తున్నారు. ఆ సమయంలో పాము కాటు వేయడంతో ఉపాధి కూలీ బలిరెడ్డి వరలక్ష్మి (71) మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే సదుపాయాలు అందిస్తామని ఏపీఓ ప్రభాకర్ తెలిపారు.

తాచుపాము కాటుకు బాలుడి బలి

మరో ఘటనలో రాజానగరం మండలం కలవచర్లలో రెండేళ్ల బాలుడు పాము కాటుతో మృతి చెందాడు. రాజమహేంద్రవరానికి చెందిన దర్శి నాగసాయి తల్లిదండ్రులతో కలసి కలవచర్లలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. పెరట్లో ఆడుకుంటున్న సమయంలో తాచుపాము అతడిని కాటు వేసింది. బాధ భరించలేక కెవ్వుమంటూ ఏడవసాగాడు. అతడిని ఏ చీమో కుట్టిందనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు ఆ బాలుడికి కొబ్బరి నూనె రాచి, నిద్రపుచ్చారు. కొంతసేపటికి నోటి నుంచి నురగలు రావడంతో కంగారుపడి పరిసరాలు పరిశీలించారు. కప్పను మింగుతూ కదల్లేకుండా ఉన్న తాచుపాము కనిపించడంతో అది కరిచిందని గ్రహించారు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అప్పటికే ఆ బాలుడు మృతి చెందాడని వైద్యాధికారి టి.రవికుమార్ తెలిపారు.

కట్లపాము కరిచి..

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు మార్కెట్‌పాలేనికి చెందిన నేదునూరి పల్లాలమ్మ(67)ను సోమవారం కట్లపాము కరిచింది. ఆమెను కుటుంబ సభ్యులు అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పల్లాలమ్మ మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



పల్లాలమ్మ (పాతచిత్రం)

కేశనపల్లి ఆవు పెయ్యలకు జాతీయ బహుమతులు

మలికిపురం: మండలంలోని కేశనపల్లికి చెందిన ఆవు పెయ్యలు జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు సాధించాయి. ఏలూరు జిల్లా మండవల్లి మండలం కానుకొల్లులో గత శని, ఆది, సోమవారాల్లో అఖిల భారత ఒంగోలు, పుంగనూరు గోజాతితో పాటు 108 దేశీయ గోజాతి ఆవుల పాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కేశనపల్లి వాసి అడబాల లక్ష్మీనారాయణ(నాని)కు చెందిన ఆవు పెయ్య ఒంగోలు జాతి పాల పళ్ల పెయ్యల విభాగంలో ద్వితీయ బహుమతి పొందింది. అలాగే ఆయనకే చెందిన పుంగనూరు ఆవు పుంగనూరు జాతి గోవుల విభాగంలో తృతీయ బహుమతి గెలుచుకుంది. ఏలూరు జిల్లా పశుసంవర్ధక అధికారి జి.నెహ్రూబాబు, నిర్వాహక సంఘం అధ్యక్షుడు పి.సత్యనారాయణ చేతుల మీదుగా లక్ష్మీనారాయణ ప్రశంసా పత్రాలు అందుకున్నారు.



బహుమతి పొందిన ఆవు పెయ్యతో లక్ష్మీనారాయణ